క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో నెలవారి మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



పండ్లు అందజేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ హై స్కూల్‌లో శుక్రవారం లేడీ ఆఫ్ ఫాతిమా ఫెస్ట్ సందర్భంగా పూర్వ విద్యార్థులు, లెక్చరర్లు, స్కూల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో దివ్యాంగులు, రోగులకు నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



సరుకులు అందజేస్తున్న పోలీసులు

బెజ్జూర్: బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎస్సై విక్రమ్ అన్నారు. మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన మడే శంకర్ బుధవారం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందగా, శుక్రవారం పోలీసుల ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్సై మోహన్ నాయక్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భౌతికకాయానికి నివాళి

బెజ్జూర్: మండల కేంద్రానికి చెందిన రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొంగ్ర జగ్గాగౌడ్ తల్లి బుచ్చమ్మ అనారోగ్యంతో గురువారం రాత్రి మృతిచెందగా శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె భౌతిక కాయానికి సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆయన సతీమణితో కలిసి నివాళులర్పించారు. అలాగే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్ రావుతో పాటు పలువురు నివాళులర్పించారు.

వివాహిత అదృశ్యం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని భట్‌పల్లి గ్రామానికి చెందిన గోమాసి మేఘన (26) అనే వివాహిత అదృశ్యమైనట్లు కాగజ్‌నగర్‌రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 10న సాయంత్రం మార్కెట్‌కు వెళ్లివస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. మేఘన కోసం బంధువులు ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. భర్త రాజశేఖర్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్	
కుమురంభీం	: మ్యాడ్
కాగజ్‌నగర్	
వెంకటరమణ	: మ్యాడ్

– ఆసిఫాబాద్‌అర్బన్


కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	100
దోసకాయ	80
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	80
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సొరకాయ	100
చిక్కుడు కాయ	120
గోబి(పూల్)	80
క్యాబేజి	60

-ఆసిఫాబాద్‌అర్బన్

భయం.. భయం..!

- జిల్లాకేంద్రంలో కోతులు, కుక్కల స్వైరవిహారం
- భయాందోళన చెందుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు
- కట్టడి చేయాలని స్థానికుల వేడుకోలు



రాజంపేటలోని ఓ ఇంటిపై కోతులు



రాజంపేటలో సంచరిస్తున్న వీధి కుక్కలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో రోజురోజుకు కోతులు, వీధి కుక్కల బెడద తీవ్రమవుతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా గుంపులుగా సంచరిస్తూ దాడులు చేస్తుండడంతో ప్రజలు తీవ్రంగా భయాందోళన చెందుతున్నారు. జిల్లాకేంద్రంలోని టీఆర్‌నగర్, రాజంపేట, బ్రాహ్మణవాడ, పొట్టి శ్రీరాములుచౌక్, వివేకానందచౌక్, అంకుసాపూర్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో వీటి సంచారం ఎక్కువగా ఉంది. దీంతో ఆయా కాలనీల్లో చిన్నారులు, వృద్ధులు ఒంటరిగా నడిచి వెళ్లే పరిస్థితులు కన్పించడం లేదు.

ఇళ్లలోకి చొరబడుతున్న కోతులు..

అడవుల్లో ఉండాల్సిన కోతులు పట్టణాల్లో సంచరిస్తున్నాయి. తినుబండారాల కోసం ఆయా కాలనీల్లో ఇళ్లలోకి చొరబడుతున్నాయి. ఇళ్లపైనే కోతులు మకాం వేస్తుండడంతో ఇంటి నుంచి బయటకు రావడానికి ప్రజలు జంకుతున్నారు. టీఆర్‌నగర్, రాజంపేట కాలనీల్లో కొందరిపై కోతులు దాడి చేసిన సంఘటనలు సైతం ఉన్నాయి. దాడులకు గురైన వారు ఇప్పటికీ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. అటవీశాఖ అధికారులు చొరవ తీసుకొని కోతుల కట్టడికి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కాలనీల్లో వీధి కుక్కల సంచారం..

వీధి కుక్కలు పలు కాలనీల్లో సంచరిస్తూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. రాత్రి సమయాల్లో ప్రజలు ఇళ్లకు చేరుకునే సమయంలో దాడి చేస్తున్నాయి. రాత్రి పూట ఒక్కరు వెళ్లేందుకు స్థానికులు భయపడుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బైకులపై వెళ్లే వారిని కుక్కలు వెంబడిస్తుండడంతో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు వీధి కుక్కలను కట్టడి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు లేవు..

పట్టణంలో కోతులు, శునకాలు విచ్చలవిడిగా తిరుగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. వాటి నియంత్రణ కోసం అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కోతులను బంధించి పట్టణం నుంచి అటవీ ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.

పిల్లలు భయపడుతున్నారు



కోతులు ఇష్టారాజ్యంగా సంచరిస్తుండడంతో పిల్లలు ఆడుకోవడానికి భయపడుతున్నారు. కోతులు, కుక్కలు నాపై దాడి చేసేందుకు ప్రయత్నించగా తప్పించుకున్నాను. చిన్నారులు, వృద్ధులు దాడికి గురయ్యే ప్రమాదం ఉంది. అధికారులు ప్రజలకు రక్షణ కల్పించే విధంగా వాటిని కట్టడి చేయాలి.

– గెడేకర్ సంతోష్, రాజంపేట

అధికారులు చర్యలు చేపట్టాలి



కోతులు, శునకాలతో ఆందోళన చెందుతున్నాం. ఇళ్లలోకి చొరబడి ఇంట్లో సామగ్రిని చిందరవందర చేస్తున్నాయి. గత వారం రోజుల నుంచి ముగ్గురిపై దాడులు చేశాయి. కోతుల నియంత్రణకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలి. వాటిని వెంటనే అటవీ ప్రాంతంలో వదిలిపెట్టాలి.

– నాగపురి కమల, గృహిణి, టీఆర్‌నగర్



పాఠశాలకు కాలినడకన వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)

బస్సు రాక పరేషాన్..!

- తిప్పలు పడుతున్న సావర్‌ఖేడా ప్రజలు
- బస్సు సౌకర్యం కల్పించాలని వేడుకోలు

కెరమెరి: జిల్లాలోని మారుమూల గ్రామాలకు సైతం రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వ మాటలు నీటిమూటలుగానే మిగులుతున్నాయి. మండలంలోని సావర్‌ఖేడా గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు, విద్యార్థులు నానా తిప్పలు పడుతున్నారు. 2019 వరకు గ్రామానికి సవ్యంగా బస్సు నడిచేది. కానీ కోవిడ్ మహమ్మారి తర్వాత బస్సు సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో వివిధ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బస్సు ప్రారంభించాలని విద్యార్థులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

కాలినడకనే ప్రయాణం..

సావర్‌ఖేడా గ్రామం నుంచి కెరమెరి, గోయగాం, ఆసిఫాబాద్ ప్రాంతాలకు వివిధ పనుల నిమిత్తం గ్రామస్తులు, చదువుల కోసం దాదాపు 50 మంది విద్యార్థులు వెళ్తుంటారు. గ్రామంలో 1 నుంచి 5వ తరగతి వరకు మాత్రమే పాఠశాల ఉండడంతో పై చదువులకు ఇతర గ్రామాలకు విద్యార్థులు వెళ్లక తప్పని పరిస్థితి ఉంది. కానీ గ్రామానికి బస్సు సేవలు నిలిచిపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సావర్‌కెడా నుంచి ధనోరా వరకు 2 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి, అక్కడి నుంచి వాహనాల్లో గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ధనోరా నుంచి సైతం బస్సులు సమయానికి రాక పోవడంతో గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉంటుంది. నిత్యావసరాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే గ్రామస్తులు సైతం కాలినడకన వెళ్లాల్సిందే.

బస్సు సేవలు ప్రారంభించాలి



గ్రామానికి బస్సు రాకపోవడంతో గ్రామస్తులు, విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కరోనాకు ముందు ఆర్టీసీ అధికారులు బస్సు నడిపించారు. కానీ ఆ తర్వాత నిలిపివేశారు. వెంటనే మా గ్రామానికి బస్సు సేవలు ప్రారంభించాలి.

– కావ్‌డే తుల్సీరాం, సర్పంచ్, సావర్‌ఖేడా

'పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయాలి'



ఎంపీపీకి వినతిపత్రం అందజేస్తున్న జోడేఘాట్ వాసులు

కెరమెరి: మండలంలోని జోడేఘాట్ గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్‌ను బదిలీ చేయాలని గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం ఎంపీపీ పెందోర్ మోతిరాం, ఎంపీడీవో మహేందర్‌ను కలిసి కోరారు. ఈమేరకు వారికి వినతిపత్రం అందజేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, గ్రామసభలు నిర్వహించకపోవడం వల్ల సమస్యలు పేరుకుపోతున్నాయన్నారు. కుమురం భీం ఉత్సవ కమిటీ సమీక్ష సమావేశానికి సైతం సదరు అధికారి హాజరు కాలేదని ఆరోపించారు. కార్యక్రమంలో పెందోర్ రాజేశ్వర్, కేశవ రావు, పెందోర్ లక్ష్మణ్, మారుతి, చందు, లక్ష్మణ్, లక్కెరావు, నాందేవ్, బాదిరావు ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

ఆసిఫాబాద్‌రూరల్: తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ అని డీఐఈవో శంకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు పూలతో బతుకమ్మ పేర్చి కళాశాల ప్రాంగణంలో బతుకమ్మ ఆడారు. డీఐఈవో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు పెద్ద పండుగ బతుకమ్మ అన్నారు. ప్రిన్సిపాల్ రాందాస్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

వాంకిడి: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై సాగర్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడులు చేసి పేకాట ఆడుతున్న ఏడుగురి వద్ద నుంచి రూ.2800 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఎవరైనా పేకాట, జూదం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



అభిషేకం చేస్తున్న భక్తులు

దహెగాం: మండలంలోని కొత్మీర్ గ్రామంలో గల పోచమ్మ ఆలయంలో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గత కొన్ని రోజులుగా విష జ్వరాలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారని, ఆసుపత్రుల చుట్టూ తిరిగినా జ్వరాలు తగ్గడం లేదని వాపోయారు. తమ గ్రామస్తులను కాపాడాలని భక్తిశ్రద్ధలతో పూజలు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

తపాలా శాఖ ఉద్యోగులకు 5జీ సెల్‌ఫోన్లు

జైనూర్: తపాలా శాఖలో నెట్‌వర్క్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం సిబ్బందికి 5జీ సెల్‌ఫోన్లు అందజేసినట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ సుజిత్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తపాల కార్యాలయంలో సిబ్బందికి 5జీ సెల్‌ఫోన్ల వాడకంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇన్సూరెన్సు, సుకన్య, మహిళలకు చిన్న మొత్తాల పొదుపు వంటి పథకాలను తపాల శాఖ అందిస్తుందన్నారు. అనంతరం ఏబీపీఎం ప్యాకర్ సౌమ్య బదిలీ కావడంతో ఆమెకు సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం రమేశ్, బీపీఎంలు తదితరులు ఉన్నారు.

మాలి కులస్తులు ఐక్యంగా ఉండాలి



నివాళులర్పిస్తున్న మాలి కులస్తులు

చింతలమానెపల్లి: మండలంలో శుక్రవారం పూలే వార్షికోత్సవ జెండా పండుగ నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలలో మాలి సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. డబ్బా గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మాలి సంఘం మండలాధ్యక్షుడు నికోడె బాపురావు మహాత్మా జ్యోతి బాపూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు నివాళులర్పించి జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మాలి కులస్తులు తమ హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలన్నారు. సంఘం నాయకులు గుర్లె శ్రీనివాస్, టాకిరె బాపురావు, గణపతి, శ్రీనివాస్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్యారంటీ కార్డుల పంపిణీ



గ్యారంటీ కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

సిర్పూర్(టి): తెలంగాణలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన కాంగ్రెస్ గ్యారంటీ కార్డులను శుక్రవారం సిర్పూర్(టి) నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కొర్రొల్ల కృష్ణారెడ్డి స్థానిక బస్టాండ్ ప్రాంతంలో పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిర్పూర్(టి), కౌటాల, కాగజ్‌నగర్, బెజ్జూర్ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



బ్యాంకు సేవలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రెబ్బెన: తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని రెబ్బెన తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ శాస్త్రి అన్నారు. మండలంలోని సింగల్‌గూడలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంవీ రూరల్ ఫోక్ అర్ట్స్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం బ్యాంకు పథకాలు, స్కీంలు, రుణాలు, రుణమాఫీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ అధికారులు నరేశ్, సునీత, కళాజాత బృందం సభ్యులు తేజకుమార్, వేణు, రైతులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువుల్లో గర్భాశయ వ్యాధికి చికిత్స



చికిత్స చేస్తున్న పశువైద్యాధికారి మురళీకృష్ణ

కెరమెరి: మండలంలోని ఝరి గ్రామంలో శుక్రవారం గర్భాశయ వ్యాధి నివారణకు ఉచిత చికిత్స అందజేసినట్లు ఇన్‌చార్జి పశువైద్యాధికారి మురళీకృష్ణ తెలిపారు. ప్రస్తుతం పశువుల్లో ఈ వ్యాధి అధికంగా సోకే ప్రమాదం ఉందన్నారు. ముందస్తుగా వ్యాధిని నివారించేందుకు చికిత్స అందజేసినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట పశువైద్య అధికారులు సోనియా, సురేశ్, సత్తయ్య, రాజ్‌కుమార్, గోపాల్‌మిత్ర సూపర్‌వైజర్ రమేశ్, శంకర్ తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయిలో రాణించిన అనికేత్



సన్మానిస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

నార్నూర్: కొమురంభీం జిల్లా కాగజ్‌నగర్ ఏకలవ్య గురుకుల పాఠశాలలో చదువుతూ జాతీయ స్థాయిలో నిర్వహించిన 4వ సాంస్కృతి పోటీల్లో తెలంగాణ రాష్ట్రం పురుషుల విభాగంలో సోలో ఇంట్రుమెంటల్‌లో ప్రథమ స్థానంలో నిలిచి మొదటి బహుమతి గెలుపొందిన మండలంలోని నాగల్‌కొండ గ్రామానికి చెందిన జాదవ్ రవీందర్, శీలా దంపతుల కుమారుడు జాదవ్ అనికేత్‌కుమార్‌ను శుక్రవారం గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుడు మాట్లాడుతూ ఏకలవ్య గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యం, ప్రతిభను గుర్తించి వాటిలో ప్రోత్సహించడం జరిగిందన్నారు. అనికేత్‌కుమార్ గిటారు వాయించడంలో దిట్ట అన్నారు. రాష్ట్ర స్థాయి ఏకలవ్య సాంస్కృతి పోటీల్లో గెలుపొంది జాతీయ స్థాయిలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరిగిన 4వ జాతీయ సాంస్కృతి పోటీలో సోలో ఇంట్రుమెంట్ పురుషుల విభాగంలో రాష్ట్రం తరుపున ప్రథమ బహుమతి సాధించినట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో రాణించిన అనికేత్‌కుమార్‌ను అందరు అభినందించి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ సునీత నారాయణ్, ఎంపీటీసీ బాదావత్ విజయలక్ష్మి ఉత్తం, గ్రామ నాయక్ గుణనాయక్, గ్రామ పెద్దలు భిక్కు జాదవ్, జీజాబాయి పాల్గొన్నారు.

తల్లిపాలతోనే ఆరోగ్యం

కాసిపేట: పుట్టిన పిల్లలకు తల్లులు పాలిస్తేనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక తెలిపారు. మండలంలోని పెద్దనపల్లి గ్రామ పంచాయతీ సోమగూడెం పాతబస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అన్నప్రాసన, ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

లాభాల్లో వాటా ప్రకటించాలి

తాండూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటాను వెంటనే ప్రకటించాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మాదారం టౌన్‌షిప్‌లో శుక్రవారం కాంట్రాక్టు కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. కార్మికులను శ్రమదోపిడికి గురిచేస్తూ వారికి తగిన వేతనాలు అందించడం లేదని మండిపడ్డారు. కాంట్రాక్టు కార్మికులకు 2022–23 ఆర్థిక సంవత్సర లాభాల వాటా వెంటనే అందజేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఇఫ్టూ నాయకులు బుచ్చన్న, నాందేవ్, శకుంతల, ఓదెమ్మ, రాజేశ్వరి, చంద్రమ్మ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ పనులు అడ్డగింత

భీమారం: భీమారం సమీపంలోని సుంకరిపల్లి మీదుగా ఏర్పాటు చేస్తున్న 11 కేవీ విద్యుత్ లైన్ పనులను స్థానికులు శుక్రవారం అడ్డగించి నిరసన తెలిపారు. అధికారుల తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమారంలోని ప్రధాన విద్యుత్ లైన్ నుంచి ఆరెపల్లి వద్ద నిర్మించనున్న రైస్‌మిల్లుకి సుంకరిపల్లి ఇళ్ల నుంచి లైన్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. దీంతో ఇళ్లలో నివసించే వారికి ఇబ్బందిగా ఉంటుందన్నారు. ఇళ్ల మీదుగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేయమని చెప్పిన అధికారులు మళ్లీ లైన్ పనులు చేపట్టారని తెలిపారు. ఈ పనులు అడ్డుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఏఈ కుమార్‌ను సంప్రదిస్తే అందుబాటులోకి రాలేదు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

దండేపల్లి: ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దని లక్సెట్టిపేట సీఐ కృష్ణ అన్నారు. మండలంలోని మామిడిపల్లిలో గురువారం రాత్రి పోలీస్ కళాజాత కార్యక్రమం నిర్వహించారు. యువత చెడువ్యసనాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కళాకారులు, తమ పాటల ద్వారా ప్రజలకు వివరించారు. ఎస్సై కుందారపు ప్రసాద్, ఏఎస్సై వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.